క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన వైద్యాధికారి



కలెక్టర్‌కు బొకేను అందజేస్తున్న నాగనిర్మల

సంగారెడ్డి జోన్: జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన నాగనిర్మల కలెక్టర్ ప్రావీణ్యను కలిశారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో పూల మొక్కను అందించి, మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉత్సాహంగా రైన్ డే సెలబ్రేషన్



రంగు రంగుల గొడుగులతో విద్యార్థులు

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని చెర్ల గోపులారం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో రైన్ డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పిల్లలతో కలిసి పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్ అనసూయ వర్షంలో గొడుగులు పట్టించి వాతావరణ మార్పులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాతావరణం మార్పులను గుర్తించే విధానాలపై పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా పలు సూచనలు చేశారు. చిన్నారులు రంగురంగుల గొడుగులతో రైన్ డే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

జహీరాబాద్ టౌన్: మాజీ సైనికుల ఆధ్వర్యంలో మంగళవారం కార్గిల్ విజయ్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమర వీరులకు నివాళులర్పించారు. పట్టణ సమీపంలో బీదర్ చౌరస్తాలోని అమర్ జవాన్ స్థూపం వద్ద కార్గిల్ యుద్ధంలో అమరులైన జవాన్‌లకు శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ సైనికులు దేవరాజ్ , న్యాయవాదులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

తారా కళాశాలలో..

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో శనివారం కార్గిల్ దినోత్సవం నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా తారా కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ మాట్లాడుతూ.. మే 3న 1999న కార్గిల్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం ప్రారంభమైందన్నారు. ఇందులో 527 మంది భారత సైనికులు అమరులయ్యారు. చివరికి జూలై 26న భారత భూభాగంలోకి ప్రవేశించిన పాకిస్తాన్ సైన్యాన్ని తిప్పికొట్టి, భారతదేశ భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడంతో భారత్ విజయం సాధించిందన్నారు. అందుకు చిహ్నంగా ప్రతి ఏటా జూలై 26 కార్గిల్ విజయ దినోత్సవం నిర్వహించుకుంటామన్నారు.

నర్సరీ పరిశీలన



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని మల్లెపల్లిలోని నర్సరీని ఎంపీడీఓ సత్తయ్య యాదవ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకంపై ఆరా తీశారు. ఎన్ని రకాల మొక్కలు ఉన్నాయి.. ఎన్ని మొక్కలు పెంచుతున్నారనే విషయాలను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. అధిక వర్షాల వల్ల మొక్కలు కుళ్లిపోయే అవకాశం ఉందని, నాటిన ప్రతి మొక్కను రక్షించాలని సూచించారు. నర్సరీలో ఈత మొక్కలు పెంచడంపై సిబ్బందిని అభినందించారు. అనంతరం గ్రామంలో కమ్యూనిటీ స్థలంలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వీరప్ప తదితరులున్నారు.

కోహీర్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా సుభాష్‌రావు

జహీరాబాద్: కోహీర్ మున్సిపల్ కమిషనర్‌గా సుభాష్‌రావు శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన జహీరాబాద్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. కొత్తగా ఏర్పడిన కోహీర్ మున్సిపాలిటీకి పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో సుభాష్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు.

వర్షానికి దెబ్బతిన్న రోడ్లు

- అడుగడుగునా గుంతలు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి



వర్షాలకు గుంతలు ఏర్పడి పాడైనా ఎర్దనూర్ రహదారి

కంది(సంగారెడ్డి): గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రోడ్లన్నీ కొట్టుకుపోయాయి. మండలంలో రహదారులు అధ్వానంగా మారాయి. అసలే అంతంత మాత్రంగా ఉన్న రహదారులన్నీ గుంతలమయంగా మారాయి. కొన్నిచోట్ల రోడ్లు కోతకు గురై కంకర తేలింది. కంది మండలంలోని బ్యాతోల్, ఎర్దనూర్, వడ్డేనగూడ తాండ, కొయ్యగుండు తండాతో పాటు ఇస్మాయిల్ ఖాన్ పేట్ బైపాస్ రోడ్డు, ఎర్దనూర్, ఉత్తర్ పల్లికి వెళ్లే రోడ్లపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. కలివేముల నుంచి మక్తఅల్లూర్ వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకగుంతను తప్పించబోయి మరోగుంతలో పడాల్సి వస్తోందని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వర్షం కురిసే సమయంలో రోడ్లపై నుంచి నీరు పారుతుండటంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక వాహనాలు గుంతల్లో పడి ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. మండలంలోని చేర్యాల కరణ్ రోడ్డుపై కంకరతేలి పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారిపై నుంచి నీటిట్యాంకర్లు, పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు వెళ్తుండటంతో చాలాచోట్ల రెండు అడుగుల లోతు రోడ్డు కుంగిపోయింది. దీంతో ఆ దారి గుండావెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా రోజుల నుంచి ఈరోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో దాదాపు అన్ని గ్రామాలకు వెళ్లే రోడ్ల దుస్థితి ఇలాగే తయారైంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాడైన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి తమ ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు కోరుతున్నారు. ఈవిషయమై పంచాయతీరాజ్ డీఈ రామకృష్ణను న్యూస్ లైన్ వివరణ కోరగా వర్షానికి రోడ్లన్నీ పాడైన మాట వాస్తవమే. రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తామని తెలిపారు.



ధ్వంసమైన వడ్డెనగూడ- ఇస్మాయిల్ ఖన్ పేట రోడ్డు

సైనికుల సేవలు మరువలేనివి

కలెక్టర్ ప్రావీణ్య



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: శాంతి భద్రతల పరిరక్షణలో సైనికుల పాత్ర మరువలేనిదని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శనివారం జిల్లా విశ్రాంత సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ పరితోష్ పంకజ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశభక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. దేశ భద్రత విషయంలో మన దేశ సైనికులు ఎక్కడ రాజీ పడకుండా ఎన్నో త్యాగాలు చేసి దేశ పరిరక్షణలో భాగస్వాములు అవుతున్నారన్నారు. అలాంటి మహనీయుల గురించి భవిష్యత్తు తరాలకు తెలపాలన్నారు. సరిహద్దుల్లో సైనికులు చేస్తున్న త్యాగాల ఫలితంగానే మనం ప్రశాంతంగా జీవిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్వంత్ సైనిక సంక్షేమ సంఘం నాయకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకాంక్షించారు. పది ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ట్రిబుల్ ఐటీ బాసర- మహబూబ్‌నగర్‌ల్లో అత్యధిక సీట్లు సాధించి సంగారెడ్డి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచారు. శనివారం సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం చేశారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన తొమ్మిది పుస్తకాల సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, సీఎంఓ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

28న నిధి ఆప్కే నికట్ 2.0

పటాన్‌చెరు టౌన్: ఈ నెల 28న నిధి ఆప్కే నికట్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు కేంద్రాల్లో శిబిరాలను ఉ. 9:30 నుంచి సా. 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. బొల్లారం పరిధిలోని ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్, పటాన్‌చెరు పరిధిలోని ఎఆర్ ఘెల్ టైర్స్ లిమిటెడ్, చౌటకుర్ పరిధిలోని ఎంపీ డిస్టిలరీస్ లిమిటెడ్, శేరిలింగంపల్లి పరిధిలోని నానక్రామ్ గూడాలోని కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ సెలేనియం టవర్-బీలో నిర్వహించనున్నట్లు చెప్పారు. భవిష్య నిధి సమస్యలు ఉన్న వారు 4 కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మునిపల్లి(అందోల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 సంవత్సరానికి గాను ఎస్సీ కేటగిరిలో మిగిలిన సీట్లకు డిగ్రీ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.కామ్ (సీ.ఎ, జనరల్, ఆనర్స్, బీ.ఏ, ట్యాక్సేషన్) బీ.ఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు జూలై 31వ తేదీన పదో తరగతి మెమో, టీసీ, బోనాఫైడ్, ఆధార్ కార్డు, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు 5 పాస్ పోటోలు తీసుకుని కళాశాలలో సంప్రదించాలన్నారు

సూపర్ లగ్జరీ బస్సుల్లో రాయితీ

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నుంచి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సుల టికెట్‌లో ధరలపై రాయితీ ఉంటుందని డిపో మేనేజర్ స్వామి తెలిపారు. రాయితీ 20 శాతం వరకు ఉంటుందన్నారు. బెంగళూరు సర్వీస్ మధ్యాహ్నం 3 గంటలకు జహీరాబాద్ డిపో నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. టిక్కెట్ ధర రూ. 964 ఉండగా రూ.728కి తగ్గిందన్నారు.

సైబర్ నేరస్తులతో జాగ్రత్త

కల్హేర్(నారాయణఖేడ్): సైబర్ నేరస్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కల్హేర్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం కల్హేర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల గురించి వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఓటీపీ వివరాలు అడిగితే స్పందించొద్దని తెలిపారు. లాటరీ, గిఫ్ట్ వచ్చిందని మోసం చేస్తారని వివరించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు.

కులగణన డబ్బులు చెల్లించండి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీలు

జహీరాబాద్: కులగణన సర్వే పనులు పూర్తి చేసిన మెప్మా ఆర్పీలకు వెంటనే పారితోషికం అందజేయాలని వారు రెవెన్యూ అధికారులను కోరారు. శనివారం జహీరాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గత ఏడాది నవంబర్ 11 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు నెల రోజుల పాటు కులగణన సర్వే నిర్వహించామన్నారు. సర్వే నిర్వహించిన ఆర్పీలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పన పారితోషికం చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు చెల్లించకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్పీలు శారద, సావిత్రి, విజయ, శోభ, లక్ష్మి, సంతోషి, అన్నపూర్ణ, గౌసియా, కృష్ణవేణి, సుప్రియ, మాధవి, వరలక్ష్మి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కషాయాల వాడకంతో ప్రయోజనం

డీడీఎస్‌కేవీకే శాస్త్రవేత్త స్నేహలత



జిగురు అట్టలు, కషాయాలను పంపిణీ చేస్తున్న స్నేహలత

జహీరాబాద్: సామూహిక ప్రదర్శన క్షేత్రాల్లో భాగంగా సోయాబీన్ పంట ఎదుగుదల, పురుగుల నివారణకు అనుసరించాల్సిన విధానాలపై డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త ఎస్.స్నేహలత రైతులకు అవగాహన కల్పించారు. శనివారం మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సోయాబీన్ పంటలో పురుగుల నివారణకు గాను జిగురు అట్టలను, పంట ఎదుగుదలకు గాను పంచగవ్య, దశపర్ణిక కషాయాలు, వేప నూనెలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోయాబీన్ పంటలో వచ్చే పురుగుల నివారణకు పసుపు పచ్చ, నీలిరంగు అట్టలు ఎకరానికి 12 వంతున అక్కడక్కడ అమర్చడం వల్ల తెల్ల దోమ, పచ్చదోమ, పేనుబంక, తామర పురుగులను నివారించవచ్చన్నారు. దశపర్ణిక కషాయం వాడడం వల్ల లద్దె దశలో రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చని వివరించారు. చెరకు పంటలో కూడా వచ్చే వేరు తొలుచు పురుగు నష్టపరిచే విధానం, జీవిత చరిత్ర గురించి వివరించి యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. మట్టి పరీక్షల నిపుణుడు స్వామి సోయాబీన్‌లో ఎరువుల యాజమా న్య పద్ధతులను వివరించారు. ప్రస్తుత పంటకు 19.:19:19 వేసుకోవాలని, పంచగవ్య 16 రకాల పోషకాలు కలిగి ఉంటుందని, మొక్క ఎదుగుదలకు, రోగ నిరోధకశక్తి పెంచేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, మల్లారెడ్డి వ్యవసా య విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అధికారులపై ఆగ్రహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ ఐదో బ్లాక్‌లో శనివారం కార్పొరేటర్ పుష్ప జీహెచ్ఎంసీ ఆధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. రోడ్లపై చెత్త ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రోడ్లు శుభ్రం చేయించారు. కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్‌ను త్వరలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

◆ వినియోగదారులకు మెరుగైన సేవలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వినియోగదారులకు మెరుగైన సేవలను అందించనున్నట్లు విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ కామేష్ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో స్థానిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

◆ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా రమణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో శనివారం లయన్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. తెల్లాపూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఈశ్వర్‌గారి రమణను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు పాల్గొన్నారు. రమణ మాట్లాడుతూ.. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

కల్హేర్(నారాయణఖేడ్): వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిర్గాపూర్ ఎస్ఐ మహేశ్ సూచించారు. విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఎవరు ఉండొద్దని చెప్పారు. పరివాహ ప్రాంతాల్లో నీటిలోకి ఎవరు వెళ్లొద్దని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు షార్ట్ సర్క్యూ ట్ వచ్చే అవకాశం ఉన్నందున వాటికి దగ్గరగా మనుషులు వెళ్లొద్దని, పశువులను కూడా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే100కి ఫోన్ చేస్తే సహాయం అందిస్తారని తెలిపారు.

◆ బీఆర్ఎస్ నాయకుడి మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బక్కారెడ్డి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. రాత్రి ఇంట్లో టీ తాగుతూ స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బీదర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించారు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే మాణిక్‌రావు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి నాయకులు ఉన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం అందజేస్తున్న సభ్యులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: వేంకటేశ్వర భక్త బృందం ప్రతి ఏడాది తిరుమల పాదయాత్ర చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యేను తన నివాసంలో భక్త బృందం సభ్యులు, పాదయాత్ర నిర్వాహకుడు సీసల్ రాజు కలసి తిరుమల పాదయాత్ర ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే, ఎమ్మెల్సీ అంజిరెడ్డికి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరికి పాదయాత్ర ఆహ్వాన పత్రం నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. తిరుమల పాదయాత్ర 29న ఉదయం మహంకాళి అమ్మవారి దేవాలయం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాలుగా ఐటీఐలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఐటీఐలను టాటా సంస్థ సహకారంతో అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాలుగా తీర్చిదిద్దుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం రామచంద్రాపురం పట్టణంలోని ఐటీఐ ప్రాంగణంలో టాటా సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సుల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలలో అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీకు అనుగుణంగా టాటా సంస్థ ఆధునిక మిషన్‌లపై విద్యార్థులకు శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఈ మిషన్‌లపై శిక్షణ పొందడం వలన ప్రపంచంలో ఎక్కడైనా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడైన పటాన్‌చెరు నియోజకవర్గంలో అనేక రకాల పరిశ్రమలు ఉన్నాయన్నారు. ఆ పరిశ్రమల్లో విద్యార్థులకు ఉపాధి కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీజీఐఐసీ జోనల్ మేనేజర్ రతన్ రాథోడ్, కార్పొరేటర్ పుష్ప, సీనియర్ నాయకులు యాదగిరి యాదవ్, పాల్గొన్నారు.

ఉపాధి పనులపై కేంద్ర బృందం ఆరా



వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం అధికారులు

నారాయణఖేడ్: ఉపాధిహామీ పథకంలో గ్రామంలో చేపట్టిన పనులపై ఎన్ఆర్ఈజీఎస్ కేంద్రం బృందం అధికారులు, ఎంపీడీఓ సంగ్రాం తదితరులు నిజాంపేట్ మండలంలోని రాంరెడ్డిపేట్, బాచేపల్లి గ్రామాల్లో శనివారం పర్యటించారు. పంచాయతీలోని రికార్డులను పరిశీలించి ఉపాధి పథకం ద్వారా పొందిన లబ్ధి, జాబ్‌కార్డుల తనిఖీ చేసి ఐకేపీ ద్వారా పొందిన రుణాలు మంజూరు వివరాలు తెలుసుకున్నారు. 25మంది లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. గ్రామంలో అమలవుతున్న ప్రతీ పథకంలో ఐదుగురు చొప్పున అన్ని పథకాలు కలిపి 40మంది లబ్ధిదారులను విచారించి వివరాలు సేకరించారు. వారి వెంట స్థానిక హౌసింగ్, ఐకేపీ, పంచాయతీ కార్యదర్శులు, ఇతర ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి



నియామకపత్రాన్ని అందజేస్తున్న సంజీవరెడ్డి

పటాన్‌చెరు టౌన్: కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర భవన కార్మిక సంఘం ఫెడరేషన్ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన నరసింహారెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో అఖిల భారత ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 26 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, వారి శ్రేయస్సు, సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా మంత్రి దామోదర దృష్టికి తీసుకువెళ్లి కార్మికుల హక్కులను కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన నియమకానికి సహకరించిన భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ కుంతియా, అఖిల భారత ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు సత్యజిత్ రెడ్డి, రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇబ్బందులు లేకుండా చూడండి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



అధ్యాపకులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఇతర జిల్లాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డి అధ్యాపకులకు సూచించారు. శనివారం మండలం పరిధి జూకల్ శివారులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఆయన సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడి సదుపాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు మీ భవిష్యత్తు కోసం చదువుకోనేందుకు ఇంత దూరం పంపారన్నారు. బాగా చదువుకుని ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని సూచించారు. కళాశాలలో ప్రస్తుతం రెండు కోర్సులు మాత్రమే ఉండగా మరిన్ని కోర్సులు ప్రవేశపెట్టే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధ్యాపకులకు పలు సూచనలు, సలహాలనిచ్చారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నాయకులు సర్దార్ నాయక్, కిషన్ నాయక్, శంకర్ ముదిరాజ్ ఉన్నారు.

ప్లానింగ్ లేని రోడ్డు విస్తరణ పనులు



అడ్డదిడ్డంగా జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులు

సంగారెడ్డి: హెచ్ఎండీఏ ద్వారా జరుగుతున్న సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డు విస్తరణ పనులు ప్లానింగ్ ప్రకారం జరగడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక వ్యాపార కేంద్రాల వద్ద గుంతలు తీసి పూడ్చకుండా వదిలేయడం వల్ల దుకాణదారులు, వాహనదారులు పార్కింగ్ స్థలం, రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దుకాణదారులు, చిరువ్యాపారులు వ్యాపారాలు జరగక నష్టపోతున్నారని వాపోతున్నారు. రోడ్డు కోసం వాడుతున్న కంకరలో ఎక్కువగా డస్ట్ పొడి వాడుతున్నారని ఇంజినీరింగ్ అధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల రోడ్డు పనులు చేపడుతున్న గుత్తేదారు పనుల్లో నాణ్యత పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బైపాస్ రోడ్డుకు ఇరువైపులా అనేక అక్రమ నిర్మాణాలు ఉన్న వాటిని తొలగించడం లేదని, వెంటనే హెచ్ఎండీఏ అధికారులు జిల్లా కలెక్టర్ సంగారెడ్డి బైపాస్ రోడ్డు విస్తరణ పనులపై సమీక్ష జరిపి పనులు మంజూరు ప్లాన్ ప్రకారం.. నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని కోరుతున్నారు.

ప్రమాదంలో చిట్టారెడ్డి చెరువు

- కోతకు గురవుతున్న కట్ట
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- చెరువులను సందర్శించిన జిల్లా ఎస్పీ

పుల్‌కల్(అందోల్): మండల కేంద్రం పుల్‌కల్‌లోని చిట్టారెడ్డి చెరువు ప్రమాదపుటంచున ఉంది. చెరువు కట్ట కోతకు గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు మరమ్మతుల కోసం ఏడాది క్రితం రూ.15 లక్షల నిధులు మంజూరయ్యాయి. వేసవిలో మరమ్మతు చేయకపోవడంతో చెరువు ఈ దుస్థితికి చేరిందని రైతులు ఆరోపిస్తున్నారు..ఈ చెరువును దశాబ్దం క్రితం మిషన్ కాకతీయ పథకం కింద మరమ్మతులు చేశారు. ఈ చెరువు కింద వంద ఎకరాల వరి, పత్తి పంటలు వేశారు. చెరువు కట్టకు తక్షణ మరమ్మతులు చేయకుంటే దిగువన పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చేశారు. కట్ట ఏక్షణంలోనే తెగిపోవచ్చని దిగువన రైతులు బిక్కుబిక్కు మంటూ వ్యవసాయ పనులు చేసుకున్నారు.



కోతకు గురైన చిట్టారెడ్డి చెరువు కట్ట

జిల్లా ఎస్పీ సందర్శన

భారీ వర్షాలు కురుస్తుండటంతో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ బలహీనంగా ఉన్న చెరువులను పరిశీలిస్తున్నాడు. ఇందులో భాగంగా శనివారం పుల్‌కల్ చిట్టారెడ్డి చెరువును, పోచారం బంగారు వాని కుంటను పరిశీలించారు. తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు.